# 21న పోలీసు ప్రధాన కార్యాలయంలో వాహనాల వేలం

### -మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్ అర్బన్, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

పోలీస్ స్టేషన్లలో యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు, గుర్తు తెలియని వాహనాలు స్క్రాప్‌గా వేలం వేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆయా పోలీస్ స్టేషన్లలో యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు, గుర్తు తెలియని వాహనాలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 103 వాహనాలను వేలం వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను మెదక్ జిల్లా పోలీస్ శాఖ అధికార ఫేస్‌బుక్, ట్విటర్లలో పొందుపర్చినట్లు వివరించారు. ఇతర వివరాల కోసం ఆర్ఐ శైలేందర్ 8712657912, ఆర్ఎస్ఐ మహిపాల్ 8712657911 లను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 21వ తేదీన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వేలం వేయనున్నట్లు వివరించారు.





మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



# రైతుల రుణమాఫీ సందేహాలను, విజ్ఞప్తులను మండల వ్యవసాయాధికారులు స్వీకరించాలి

### -జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు19 ప్రభాతవార్త:** రైతుల రుణమాఫీ సందేహాలను, విజ్ఞప్తులను మండల వ్యవసాయాధికారులు స్వీకరించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యవసాయాధికారులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆఫీస్‌లో ఉండి రైతుల రుణమాఫీ సందేహాలను, విజ్ఞప్తులను స్వీకరించాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు. రుణమాఫీకి సంబంధించి ఆధార్ మిస్ మ్యాచ్, ఫ్యామిలీ గ్రూప్ ఇన్ అగ్రికల్చర్, పాస్‌బుక్ సంబంధించి కరెక్షన్ చేయాల్సిన విధానం ఇంకా రుణమాఫీ వెబ్‌సైట్ నందు రానందున అప్పటి వరకు ఆధార్ కార్డు వివరాలు, ఫ్యామిటీ మెంబర్స్ ఆధార్ కార్డు వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు సేకరించి ప్రత్యేక రిజిష్టర్ మెయింటేన్ చేయాలని ఆదేశించారు.



మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రాఖీలు కడుతున్న బాలికలు



ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



సిద్దిపేట ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్

### -మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

సోదర భావానికి ప్రతీకగా ప్రతి ఏటా జరుపుకునే పండుగ రక్షాబంధన్ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ బాలసదనం బాలికలు సుమారు 16 మంది జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సోదర భావానికి ప్రతీకగా ప్రతియేటా జరుపుకునే పండుగ రక్షా బంధన్ అని అన్నారు. రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్ రాజ్ శుభాకాంక్షలు తెలిపరు. ప్రజలందరూ రాఖీ పండుగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించి ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు. అక్కా, చెల్లెళ్ల రక్ష తమ గురుతర బాధ్యత అని రక్షాబంధన్ కర్తవ్యాన్ని గుర్తు చేస్తుందన్నారు. సోదరభావంతో, ప్రేమానురాలతో ప్రతి సంవత్సరం శ్రావణ మాసం పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే ఈ వేడుక భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని యావత్ ప్రపంచానికి చాటుతుందన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధనయ ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిలానఆల స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ, డీసీపీవో కరుణ, గంగాధర్, చైల్డ్ హెల్ప్‌లైన్ భారత్, రవీందరన తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన డిఇ ప్రేరణ

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** సిద్దిపేట మున్సిపల్ ఇంచార్జి కమిషనర్‌గా పని చేస్తున్న డీఈ ప్రేరణ సోమవారం పూర్తి స్థాయి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన కె.ప్రసన్నరాణి ఇటీవల బదిలీపై వరంగల్ డిప్యూటి కమిషనర్‌గా వెళ్లారు. అమె స్థానంలో హైదారాబాద్ జిహెచ్ఎంసిలో పని చేస్తున్న సంధ్యను సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా సంధ్య బాధ్యతలు స్వీకరించకపోవడంతో డీఈగా పనిచేస్తున్న ప్రేరణను ఇంచార్జి కమిషనర్‌గా నియమించారు. ఇప్పటివరకు మున్సిపల్ కమిషన్‌గా సంధ్య రాకపోవడంతో ఆమె స్థానంలో ఇంచార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న డీఈ ప్రేరణకు బాధ్యతలు అప్పగించారు. ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

## మల్లికార్జున ఖర్గేను కలిసిన కాంగ్రెస్ నేత



ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గెకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు చక్రధర్‌గౌడ్

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 19,ప్రభాతవార్త :** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గెన్ సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు, ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ గాదగోని చక్రధర్‌గౌడ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాతో పాటు నియోజకవర్గ పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు చక్రధర్‌గౌడ్ తెలిపారు.

## తహసీల్దార్‌గా సతీష్‌కు బాధ్యతలు

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల తహసీల్దార్‌గా సతీష్‌ను నియమిస్తూ జిల్లా పాలనాధికారి రాహల్ రాజ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇంతవరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన లక్ష్మణ్‌బాబున మెదక్‌కు బదిలీ చేశారు. అల్లాదుర్గంలో బాధ్యతలు నిర్వహించిన సతీష్‌కు పాపన్నపేట మండలానికి బదిలీ చేశారు.

## 21న భారత్ బంద్ జయప్రదం చేయాలి

### జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**మద్దూరు(చేర్యాల), ఆగస్టు 19,ప్రభాతవార్త :** ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు రాష్ట్రాలకు స్వేచ్ఛ కల్పిస్తూ ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దేశంలోని వివిధ దళిత సంఘాలు ఈనెల 21 ఇచ్చిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణంలోని మాల భవనంలో సోమవారం నిర్వహించిన మాల మహానాడు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, ఫిల్లింగ్ స్టేషన్లు,సినిమా హాళ్లు స్వచ్ఛందగా మూసి వేసి బంద్‌కు సహకరించాలన్నారు. ఎస్సీవర్గీకరణపై ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఉపసంహారించుకునేవరకు పోరాటం చేస్తామన్నారు.బంద్‌లో మాల మాల ఉపకులాలు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు గుస్క రామదాస్,పుట్ట యాదయ్య, ఉద్యోగస్తులు కాటం శ్రీనివాస్, పుట్ల మల్లికార్జున్, పుట్ట రాజశేఖర్, కాటం రవీందర్, కమలాపురం రమేష్, కల్లాటి పృధ్వీరాజ్, నియోజకవర్గ ఇంచార్జి శ్రీరామ్ వెంకటేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చంద శ్రీకాంత్, న్యాయవాదులు నేరటి వెంకటేష్, గుసక వెంకటేష్, కొలుపుల రి,బరిగల ఐలయ్య, బుట్టి సాయికుమార్, కాటం రాజశేఖర్, కొలుపుల రాజు, కమలాపురం శేఖర్, కాటం మహేష్, వలిమే భరత్, కమలాపురం కిరణ్, బదుగు సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

# విజ్ఞప్తులు సత్వరమే పరిష్కరించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధసమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదిదారులతో మమేకమై వారి సమస్యలను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పరిష్కరించుటకు వీలు లేనిపక్షంలో తదుపరి చర్యల కోసం వారి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదారుల నుండి 63 విజ్ఞప్తులను స్వీకరించారు. అందులో రుణమాఫీ-22, ధరణి-19, పింఛన్-4, ఇతర సమస్యలు-22 మొత్తం 63 దరఖాస్తులు వచ్చాయి. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండ వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ అర్య, వివిధశాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

### -అధికారులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచన

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రజావాణిలో సోమవారం వచ్చిన 23 దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 12 రెవెన్యూ, 1 సర్వే ల్యాండ్ రికార్డు, 3 పంచాయతీరాజ్, 5 మున్సిపల్ శాఖ, 2 వ్యవసాయ శాఖకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ, ఆర్‌డిఓ వసంత కుమారి, జిల్లా అధికారులు సాయిబాబా, జగదీష్, నరసింహ, అఖిలేష్‌రెడ్డి, జానకిరెడ్డి, డాక్టర్ గాయత్రి దేవి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య చర్యలపై నిర్లక్ష్యం వహించొద్దు...

గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం సంగారెడ్డిలో పంచాయతీ, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం అయి పలు సూచనలు చేశారు. వర్షాకాలం కొనసాగుతున్నందున సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల పంచాయితీ అధికారులు, మున్సిపల్ కమీషనర్‌లు, వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్‌డిఏ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయితీ అధికారులు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎన్‌హెచ్‌ఓ, గ్రూపు మహిళలు సమన్వయంతో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిపిఓ సాయిబాబా, డిఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రి దేవి, పిడి డిఆర్‌డిఓ జ్యోతి, పంచాయితీ రాజ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 19, ప్రభాతవార్త :**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని రామాయంపేట మున్సిపాలిటీలో స్థానిక అవుట్‌డోర్ ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. రామాయంపేట అవుట్ డోర్ ఫోటో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు రొయ్యల హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1837లో లూయిస్ డాగోరే అభివృద్ధి చేసిన ఫోటోగ్రాఫిక్ యొక్క ఆవిష్కరణ జ్ఞాపకార్థం ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. ఈ ప్రక్రియను ఫ్రెంచ్ ప్రభుత్వం 1839 ఆగస్టు 19 ప్రపంచానికి బహుమతిగా అధికారికంగా ప్రకటించింది అన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఫోటోగ్రఫీ అద్భుతంగా అభివృద్ధి చెంది వ్యక్తీకరణ కమ్యూనికేషన్ మరి డాక్యుమెంటేషన్ యొక్క శక్తివంతమైన మధ్యమంగా మారింది. అందువల్ల ఫోటోగ్రఫీ చరిత్రలో ఈ ముఖ్యమైన మైలురాయిని గౌరవించడానికి ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఎంచుకొని నిర్వహించడం జరుగుతుందన్నారు. 1839లో ఫోటోగ్రఫీ యొక్క తొలి విజయవంతమైన రూపాల్లో ఒకటైన డ్యాగురో టైప్ ప్రక్రియ యొక్క ప్రకటనను ఆగస్టు 19 సూచిస్తుందన్నారు.

ఈ సంఘటన చిత్రాలను సంగ్రహించి మరియు భద్రపరిచే విధానంలో విప్లవత్మాకమైన మార్పులు చేసిందని, ఆధునిక ఫోటోగ్రాఫిక్ పునాది కూడా వేసిందన్నారు. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఫోటోగ్రాఫర్లను ప్రోత్సహిస్తుందని, వృత్తిపరమైన వారి పనిని పంచుకోవడానికి ఫోటోగ్రఫీలో సృజనాత్మక అంశాలను జరుపుకోవడానికి చిత్రాల ద్వారా ప్రపంచంలోని అందం మరియు వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ఒక అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు మజీద్, కోశాధికారి యాదగిరి, సర్దార్ నాయక్, స్వామి, మల్లేశం, వినోద్, శివ, రాజ్‌కుమార్, శ్రీకాంత్, రామకృష్ణ తదితర సభ్యులు పాల్గొన్నారు.



ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు రాఖీ కడుతున్న సోదరి

## ఎంపి సురేష్‌శెట్కార్‌కు రాఖీ కట్టిన సోదరి

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం హైద్రాబాద్‌లోని సంజీవరెడ్డి నగర్‌లోని ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్ స్వగృహంలో సురేశ్ శెట్కార్ సోదరి రాఖీ కట్టి ఆశీస్సులు అందచేశారు. ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్‌తో పాటు సురేశ్‌శెట్కార్ సోదరులు ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం అధ్యక్షులు నగేష్‌శెట్కార్‌కు సైతం సోదరి రాఖీ కట్టి మిఠాయిలతో నోటిని తీపి చేశారు.

## పట్టాపాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి

### ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హీరాలాల్

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** పట్టాపాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు ఉన్న రుణాలను మాఫీ చేయాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హీరాలాల్ ప్రభుత్వానికి వినతి చేశారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చేసిన హామీ మేరకు 2 లక్షల రూపాయలను ప్రతి రైతుకు మాఫీ చేయాలన్నారు. బ్యాంకులకు వెళ్లి వెంటనే రుణాలను తీసుకోవాలని అప్పట్లో రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన రైతులకు రుణాలను మాఫీ చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగి వ్యవసాయంపైనే ఆదారపడి ఉన్నారన్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులుగా ఉన్న రైతుల రుణాలను మాఫీ చేయకుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడం తథ్యమని గుర్తు చేశారు.

## పిడుగుపాటుతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

**సిద్దిపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ పరిధిలోని మూతన్నపేటలో సోమవారం పిడుగుపడి ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కేడిక కిషన్‌రెడ్డి పాడి ఆవును పొలం వద్ద మేపుతున్నారు. సాయంత్రం వర్షం పడుతున్న సమయంలో పిడుగు పాటుకు ఆవు మృతి చెందింది. ఈ సందర్భంగా రైతుకు రూ.70 వేల ఆస్థినష్టం జరిగింది. ఆవు మృతి చెందడంతో బాధితుడు బోరున విలపించారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సాంప్రదాయబద్ధంగా రక్షాబంధన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

'అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ బంధానికి నిదర్శనంగా నిలిచే రాఖీ పండుగ సోమవారం ఘనంగా జరిగింది. సుదూర ప్రాంతాల నుండి సోదరులకు రాఖీ కట్టడానికి అక్కా, చెల్లెళ్లు రావడంతో ఇంటింటా సందడి నెలకొంది. సోదరులకు సోదరీమణులు ఆప్యాయంగా రాఖీలు కట్టి బహుమానాలు అందుకున్నారు. పట్టణంలో రాఖీల దుఖాణాలు, స్వీట్‌హౌస్‌లు కిటకిటలాడాయి. సుదూరంలో ఉన్నవారు.. రావడం వీలులేని వారు పోస్టు ద్వారా, కొరియర్‌ల ద్వారా రాఖీలను అందించారు. ఉదయం నుండే హ్యాపీ రక్షాబందన్ అంటూ ఎస్ఎంఎస్‌ల సందడి సాయంత్రం దాకా సాగింది. రాఖీ పౌర్ణమితో పాటు శ్రావణ పౌర్ణమి కావడంతో గ్రామాల్లోని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని పలు దేవాలయంలో శ్రావణ పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

**బాలసదనంలో...**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో, బాలసదరంలో రాఖీ పండుగ ఘనంగా నిర్వహించారు.రాఖీ పౌర్ణఇ పండుగ సందర్భంగా బాలసదనం, కలెక్టరేట్ సందడిగా మారింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా కలెక్టరేట్‌లో, బాలసదనంలో బాలికలు కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి రాఖీలు కట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్‌కు ప్రతి విద్యార్థి రాఖీ కట్టగా కలెక్టర్ స్వయంగా స్వీట్లు తినిపించి అక్షింతలు వేసి ఎల్లప్పుడూ ఆనందంగా సంతోషంగా ఉండాలని ఆశీర్వదించారు. పిల్లలందరిని షాపుకు తీసుకెళ్లి వారికి నచ్చిన దుస్తులను తీసుకోవాలని డబ్బులు తాను అందిస్తానని జిల్లా సంక్షేమ అధికారి శారదను ఆదేశించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులకు పిల్లలు రాఖీలు కట్టారు. ఐడిఓసిలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు బాలసదనం బాలికలు రాఖీలు కట్టారు.

**కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాయలయంలో**

జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మహిళ విభాగం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మహిళా విభాగం నాయకులు ముద్దం లక్ష్మి, మార్క పద్మ, వనజ, సంతోషి, కవిత, శారద తదితరులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణకు రాఖీలు కట్టి నీవు నాకు రక్షా, నీకు నేను రక్షా అన్ని అన్నారు. కార్యక్రమంలో కలీం, వాహబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మిర్‌దొడ్డిలో...**

మిర్‌దొడ్డి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం రక్షాబంధన్ పండగా ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాలను సుందరంగా అలంకరించి మహిళలు మంగళహారుతులతో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచుకున్నారు.

**కొమురవెల్లిలో...**

కొమురవెల్లి మండలంలో ఘనంగా రక్షాబందన్ వేడుకలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సోదరిలు సోదరులకు రాఖీలు కట్టి కట్న కానుకలు అందుకున్నారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాలనికి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

**నంగునూర్‌లో...**

నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో రాఖీ పూర్ణిమ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణపూర్ణిమ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. తోబుట్టువుల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండగ సందర్భంగా మహిళలు కొత్త బట్టలు కట్టుకుని తోబుట్టువులకు రాఖీలతో రక్షాబంధన్ చేశారు. మిఠాయిలను పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా సంబరంగా జరుపుకున్నారు.

**మాజీ మంత్రికి రాఖీ కట్టిన మాజీ జడ్పీటిసి స్వప్న**

**న్యాల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుకు ఆయన స్వగృహంలో మాజీ జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్నభాస్కర్ సోమవారం రాఖీ కట్టారు. బిఆర్ఎస్ నాయకులు బోడ భాస్కర్ హరీష్‌రావుకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. న్యాల్‌కల్ మండలంలో కొనసాగుతున్న రాజకీయ పరిస్థితలపై బోడ భాస్కర్‌ను తన్నీరు హరీష్‌రావు అడిగితెలుసుకున్నారు.

**కొల్చారం మండలంలో...**

**కొల్చారం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ.. ఈ రాఖీ పండుగ రోజు చెల్లెళ్ల అన్నా తమ్ముళ్ల క్షేమంగా ఉండాలని రక్షగా రాఖీ కడతారు. మండల కేంద్రమైన కొల్చారం, రంగంపేట గ్రామాలతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు గ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి వారి ఆశీర్వాదాలు పొందడంతో వారి నుండి బహుమతులను అందుకున్నారు. రంగంపేటలోని శివాలయంలో ఇక్కడి పద్మశాలీలు ఎప్పటిలాగే సామూహిక జంధ్యా ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



హరీష్‌రావుకు రాఖీ కడుతున్న స్వప్నభాస్కర్



కొల్చారంలో సోదరునికి రాఖీ కడుతున్న సోదరీమణులు

**వెల్దుర్తిలో...**

**వెల్దుర్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకైన రక్షాబంధన్‌ను సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల నుండి అక్కా చెల్లెళ్లు వచ్చి అన్నాదమ్ముళ్లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



బాలసదనంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి రాఖీకడుతున్న విద్యార్థులు



కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో...



వెల్దుర్తిలో సోదరునికి రాఖీ కడుతున్న సోదరి

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించబోం

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

**ముషీరాబాద్, ఆగస్ట్ 19, ప్రభాతవార్త:** స్వరాష్ట్రం, స్వయం పాలన ఆధారంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర పౌరుషాన్ని ఢిల్లీ నడివీధుల్లో తాకట్టు పెడుతూ తెలంగాణ ఆత్మ గౌరవాన్ని కించపరుస్తూ ఉంటే ఇక సహించబోమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా హెచ్చరించారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎవరూ లేనట్లు అభిషేక్ సింగ్వీని నామినేట్ చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండి ఢిల్లీకి ప్రదక్షిణలు చేయటమే సరిపోతోందని, అధిష్టానం అనుమతి లేనిదే ఏ ఫైలు ముందుకు సాగటం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను అవమాన పరచటమే కాంగ్రెస్ సంస్కృతిగా మారిపోయిందని, ఇటువంటి వైఖరిని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## రాఖీ వేడుకల్లో గోల్నాక కార్పొరేటర్



నల్లకుంటలోని తన నివాసంలో రాఖీ వేడుకల్లో పాల్గొన్న గోల్నాక కార్పొరేటర్ దంపతులు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త**

అంబర్‌పేటలో రాఖీ పండుగ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. నల్లకుంటలో తన నివాసంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ రాఖీ వేడుకలు జరుపుకున్నారు. తన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లావణ్య, దూసరి శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు అక్క చెల్లెలు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి తమ అనురాగాన్ని చాటుకుంటున్నారని చెప్పారు. కుటుంబాలకు మంచి భవిష్యత్తును అందించడంలో అక్కచెల్లెళ్ల పాత్ర కీలకమని మేము బలంగా నమ్ముతున్నామని పేర్కొన్నారు. అనురాగాలకు ప్రతీకగా, అనుబంధాలకు రక్షణగా రాఖీ పర్వదినమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దూసరి వెంకట్‌గౌడ్, దూసరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసిన మందకృష్ణ మాదిగ



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ

**చిక్కడపల్లి, ఆగస్టు 19ప్రభాతవార్త:**

హైదరాబాద్ నగరంలోని రామ్‌నగర్‌లో నివాసముంటున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష నెరవేరడానికి ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అండదండలు అందించినందుకు దత్తాత్రేయకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ ప్రజలు చేస్తున్న పోరాటానికి మొదటినుంచి దత్తాత్రేయ మద్దతుగా నిలిచారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తీసుకెళ్ళడంలో దత్తాత్రేయ ఎంతో చొరవ తీసుకున్నారన్నారు. ముఖ్యంగా సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణ అంశం విజయసాధించిన నేపథ్యంలో దత్తాత్రేయను కలగడం తనకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్, ముషీరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ గజ్జల రాజశేఖర్ మాదిగతదితరులున్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో రాఖీ పండుగ వేడుకలు



రక్షా బంధన్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త :**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో సోమవారం ఘనంగా రక్షా బంధన్ (రాఖీ పండుగ ) వేడుకలు జరిగాయి. డివిజన్ పరిధిలోని ఏ బస్తీలో చూసి రాఖీ పండుగ వాతావరణం కనిపించింది. కాగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి డివిజన్‌కు చెందిన మహిళా మోర్చ బిజెపి మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకని తెలిపారు. డివిజన్‌కు చెందిన పలువురు బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ : ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీణేష్‌కు రాఖీ కడుతున్న కాంగ్రెస్ మహిళలు నాగినేని సరిత తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు 19 ప్రభాతవార్త:**

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ బందానికి రక్షా బంధన్ ప్రతీకగా నిలుస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వందలాది మంది మహిళలు పాల్గొని ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో జెకెఎ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్

**గచ్చిబౌలి, ఆగస్టు 19 ప్రభాతవార్త**

జపాన్ కరాటే అసోసియేషన్(జెకెఎ) ఇండియా 50వ సంవత్సర వేడుకలను పురస్కరించుకొని 2025 జనవరి 18 నుంచి 22వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో ప్రతిష్టాత్మక ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. 50ఏళ్ల అనంతరం నగరంలోఓ మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ మెగా అంతర్జాతీయ టోర్నమెంటులో ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 3వేల మంది పాల్గొంటారని తెలిపారు. ఈమేరకు సోమవారం గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో జెకెఎ చీఫ్ ఇన్స్ట్రక్టర్ టకుయా తనియామా, జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(జెకెఎఐ) చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ షిహాన్ ఆనంద్ రత్న, తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లు రాపోలు సుదర్శన్, దయానంద్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఈ టోర్నమెంటును జెకెఎఐ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకొని మొత్తం మూడు టోర్నమెంట్ల వివరాలను ప్రకటించారు. 42వ జెకెఎ ఇండియా నేషనల్ కరాటే టోర్నమెంటు, 17వ ఆల్ ఇండియా జెకెఎఐ క్యూలెవెల్ కరాటే టోర్నమెంటు, 12వ ససాకి, షోయిచి, మోమోరియల్ సీనియర్స్ నేషనల్ కరాటే టోర్నమెంటు 2025 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలో మొదటిసారిగా నగరంలో ఈ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంటు ద్వారా జెకెఎ కరాటే క్రీడాకారులకు నేర్చుకునేందుకు ఎంతో అవకాశం ఏర్పడుతుందని అన్నారు.





సమావేశంలో పాల్గొన్న జెకెఎఐ ప్రతినిధులు

కటా, కుమిటే భాగస్వామ్యానికి త్వరలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. స్వీయ రక్షణ కోసం భారతదేశంలో జెకెఎ కరాటే ఎంతో ప్రాముఖ్యతను సొంతం చేసుకుందని, తల్లిదండ్రులు తమ పిల్లల స్వీయరక్షణ కోసం కరాటేను నేర్పిస్తున్నారని అన్నారు. 70వ దశకంలో ముంబైలోని దాదర్‌లో మొదటి జెకెఎ బ్రాంచ్ ఏర్పాటు జరిగిందని, నేడు దేశంలోని 21 రాష్ట్రాలలో శాఖలు విస్తరించి ఉన్నాయన్నారు. మహిళలు సైతం జెకెఎ కరాటే మీద ఆసక్తి చూపుతున్నారని, 2017లో 30శాతం భాగస్వామ్యం ఉండగా, 2019కి 40శాతానికి మహిళల భాగస్వామ్యం పెరిగిందని, ఈ దఫా 50శాతానికి చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ లెవెల్, సీనియర్ లెవెల్ విభాగాల్లో పోటీలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెకెఎఐ ప్రతినిధులు, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

# గండిపేట్ మండలంలో ఘనంగా "రాఖీ" వేడుకలు

**నార్సింగి, ఆగస్టు 19 ప్రభాతవార్త :**

గండిపేట్ మండలంలోని అన్ని ప్రాంతాలలో సోమవారం "రాఖీ" వేడుకలు ఘనంగా జరిగాయి. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని బైరాగిగూడ, గంధంగూడ, హైదర్షాకోట్, పీరంచెరువు, బండ్లగూడ, కిస్మత్‌పూర్, హిమాయత్ సాగర్ గ్రామాలలో అలాగే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, కోకాపేట్, మంచిరేవుల, గండిపేట్, ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్‌నాంపూర్ గ్రామాలలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులంతా రాఖీ వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. అక్కా, తమ్ముళ్లు తమ సోదరుల ఇళ్లకు వచ్చి నీవు నాకు రక్షా... నేను నీకు రక్షా...మనమిద్దరం ఈ దేశానికి రక్షా అంటూ రాఖీలు కట్టారు. సోదరులు తమ తోబుట్టువులకు చీరలు పెట్టి దీవించారు. ముదిరాజ్ కార్పోరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, తలారి పద్మావతి పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పుష్పమ్మ, పద్మావతి పాపయ్య యాదవ్, శ్రీలత సురేష్‌గౌడ్, మాలతి నాగరాజు, స్రవంతి నరేందర్, రాము, నిఖిలా సంగారెడ్డి తదితరులు తమ సోదరులకు రాఖీలు కట్టారు. రాఖీలు కట్టించుకున్నారు. అలాగే నార్సింగి మున్సిపల్ చైర్పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ గోపాల విజయ్ బాబు, కౌన్సిలర్లు శివారెడ్డి, ఉషారాణి, అరుణజ్యోతి, వెంకటేష్ యాదవ్, యాదమ్మ, రేఖ యాదగిరి, సునీత గణేష్, విజేత ప్రశాంత్ యాదవ్, అమరేందర్‌రెడ్డి, ఆదిత్యరెడ్డిలు, మాజీ ఎంపిపి తలారి మల్లేష్, మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ నరేందర్ ముదిరాజ్, వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు.

పలు వసతి గృహాలలో విద్యార్థులు రాఖీల పండగను ఘనంగా జరుపుకున్నారు.

## పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి : గంజి రఘునాథ్



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న పద్మశాలి యువజన సంఘం ప్రతినిధులు

**మెహిదీపట్నం, ఆగస్టు 19, ప్రభాతవార్త :**

కార్వాన్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన గంజి రఘునాథ్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం కార్వాన్ మార్కెండ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంజి రఘునాథ్ ప్రమాణస్వీ కారం చేసిన అనంతరం మాట్లాడారు..పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని, అపుడే తమకు రావాల్సిన వాటా ప్రకారం నిధులతో పాటు రాజకీయ అవకాశా లను పొందగలుతామన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో అత్యధికంగా ప్రద్మశా లీలు ఉన్నామని గుర్తు చేశారు. రాజకీయ అవకాశాలు అందిపుచ్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్వాన్‌లోని పద్మశాలి కులస్తులందరిని కలుపు కొనిపోవడంతో పాటు వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. నిరం తర కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెల్తామన్నారు. కార్యక్రమంలో కార్వాన్ మార్కెడయ భవన్ ట్రస్ట్ అధ్యక్షులు కడిగె పాండయ్య, పద్మశాలి యువజన సం ఘం ప్రధాన కార్యదర్శి జితేందర్, ఉపాధ్యక్షులు క్రాంతి శ్రీకాంత్, వరుణ్, దయా నంద్‌లు ఉన్నారు.

**మార్కెండ భవన్‌లో ఘనంగా రాఖీ వేడుకలు.**

కార్వాన్ మార్కెండెయ భవన్‌లో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం యజ్ఞోపదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మార్కెండయ భవన్ ట్రస్ట్ అధ్యక్షులు కడిగె పాండయ్య, ఉపాధ్యక్షులు చెన్న చంద్రయ్య, చెన్న జయదేవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఉత్తరపల్లి కృష్ణ మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల, కౌకుంట్ల కల్పన, చెన్న నరేందర్, రాజు, శ్రీశైలం, లక్ష్మినారాయణలు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ రహదారిపై న్యాయవాదుల ఆందోళన

-రహదారిపై నిలిచిన వాహనాలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 19 ప్రభాతవార్త:**



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కూకట్‌పల్లిలో న్యాయవాదిపై పోలీసు లు చేసిన దాడిని ఖండిస్తూ ఎల్బీనగర్ రంగారెడ్డి జిల్లా కోర్టు ముందు న్యాయ వాదులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. న్యాయవాదులపై పోలీసులు వరుస దాడులు జరగడం పట్ల ప్లకార్డులు పట్టుకొని న్యాయస్థానం ముందు విజయవాడ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బార్ అసోసియేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు వై. కొండల్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయ వాదులపై పోలీసులు జరుపుతున్న వరుస దాడులు హేయమైన చర్య అన్నారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది సంతోష్‌పై దాడి చేసిన బోరబండ పోలీసులపై కఠిన చర్యలు తీసుకొని వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోర్టు విధులు బహిష్కరించాలని కొండల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నిసార్లు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేసిన శాంతియుతంగా ఉన్న న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడం సరైంది కాదని, న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై దాడి చేసి వారిని హింసించడం చట్టాన్ని ఉల్లం ఘించడమేనన్నారు. న్యాయవాదుల నిరసనతో హైవేపై భారీగా వాహనాలు నిలిచి పోయాయి. కార్యక్రమంలో సత్య నారాయణరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

## సాంప్రదాయబద్ధంగా రక్షా బంధన్ వేడుకలు

-సోదరునికి రాఖీ కట్టిన సబితా ఇంద్రారెడ్డి



సోదరునికి రాఖీ కడుతున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అక్కా-తమ్ముళ్లు, అన్నా-చెల్లెళ్ళ మధ్య అనురాగాలు, ఆప్యాయతలకు ప్రతిబింబంగా నిలిచి రక్షా బంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పవిత్ర శ్రావణ మాసంలో వచ్చిన ఈ పర్వదినాన్ని కుటుంబాల్లో సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. నిత్యం రాజకీయాల్లో, ప్రజా సేవలో బిజీగా గడిపే మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న తన ఏకైక సోదరుడు నరి సింహారెడ్డి (బాబు) వద్దకు వచ్చి రాఖీ కట్టారు. అనంతరం బాబు తన అక్క ఆశీర్వాదం తీసుకున్నారు. పండుగ సందర్భంగా కొద్ది సేపు సబితా ఇంద్రారెడ్డి తన తమ్ముని ఇంట్లో ఉల్లాసంగా గడిపారు.

## చికిత్స పొందుతూ పాప మృతి..

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 19, ప్రభాతవార్త**

వేడి నీళ్లు మీదపడి ఓ పాప ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంపల్లి మున్సిపల్‌లో నివాసం ఉంటున్న సురేష్ కూతురు అక్షర మూడు సంవత్సరాలు. ఈ నెల 9న ఉదయం తల్లి స్నానం చేయించేందుకు బాత్రూంలోకి తీసుకువెళ్లింది. బాత్రూంలో సబ్బు లేకపోవడంతో తల్లి ఇంట్లోకి రాగానే అక్షర వేడి వాటర్ పోసుకోవడంతో తీవ్ర గాయాలైంది. గాయాలైన పాపను చికిత్స నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుడిని సురక్షితంగా కాపాడిన ప్రశాంత్..

**సంజీవ్‌రెడ్డి నగర్, ఆగస్టు 19, ప్రభాతవార్త**

ఫైర్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 9:30 గంటల సమయంలో సనత్‌నగర్‌లో మహమ్మద్ సమీ ఇక్బాల్ నివాసం ఉంటున్నాడు. అతని కొడుకు మోహినుద్దీన్ (2) కొద్దిగా అనారోగ్యానికి గురై తరుచూ ఏడుస్తుండడంతో ఫోన్ ఇవ్వగా బెడ్ రూమ్‌లోకి వెళ్లి బాలుడు లాక్ చేసుకుని ఫోన్‌లో బొమ్మలు చూస్తున్నాడు. కొంత సమయం గడిచిన తరువాత ఎంతసేపటికి డోర్ రాకపోవడంతో బాలుడు బెడ్‌రూమ్ లోపల ఏడవడం మొదలుపెట్టాడు. తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమయ్యారు. చుట్టుప్రక్కల వాళ్లు వచ్చి చూడగా డోర్ తెరవడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ మేరకు సనత్‌నగర్ ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయగా వారు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి గుణపం సహాయంతో తలుపుకు ఉన్న లాక్‌ని పగలగొట్టి లోపల ఉన్న బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకకు ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రశాతర్ ఎంతో చాకచక్యంగా బాలుడిని తలుపుకు ఉన్న లాక్‌ని పగులగొట్టి తల్లిదండ్రులకు సురక్షితంగా మెహినుద్దీన్‌ను కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు పలువురు ప్రశాంత్‌ను ప్రశంసించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

**హయత్‌నగర్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు... కొంగరకలాన్‌కు చెందిన గోపగల జనార్ధన్ సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో కోహెడ పెద్దఅంబర్‌పేట సమీపంలోని ఫంక్షన్‌హాలులో మాంసం సరఫరా చేయడానికి ఆటోలో వస్తున్నాడు. కోహెడ-పెద్దఅంబర్‌పేట మధ్యలోని నారాయణ కళాశాల వద్దకు రాగానే హయత్‌నగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టిఎస్07 యుఇ 5469) ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో నుంచి ఎగిరిపడిన జనార్ధన్ మీదుగా బస్సు వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. జనార్ధన్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నట్లు సమాచారం. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### క్రమశిక్షణకు మారుపేరు వెంకటస్వామి : ఎమ్మెల్యే వివేక్

**నాంపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త :** వెంకటస్వామి ఎంతో క్రమశిక్షణ, సమాజం పట్ల ఎంతో విజన్ ఉన్న మహోన్నత వ్యక్తిత్వం ఆయనదన్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తాను రాజకీయ నాయకుడుగా, వ్యాపారవేత్తగా రాణించడానికి అవి ఎంతగానో దోహదపడ్డాయని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే బ్యాక్ టు సొసైటీగా సంపాదించిన దానిలో కొంతమేర విశాఖ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ట్రస్ట్ కార్యాలయంలో జస్టిస్ చంద్రయ్య, ఏపి చిత్తూరు ఎంపి ప్రసాదరావు, ఐపీఎస్ అధికారిణి చేతనలతో కలిసి వివేక్ పాల్గొని మాట్లాడుతూ పీపుల్ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థులకు ట్రస్టు ఛైర్మన్ బాలకృష్ణ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడంవల్ల ఎంతోమంది నిరుపేద విద్యార్థులు వృద్ధిలోకి వస్తారన్నారు. దళితులు ఏరంగంలో ఉన్నా వారి అభ్యున్నతికి తాను ఎప్పుడూ ముందుంటానని, గతంలో రైతుబంధు కౌలు రైతులకు వర్తింపజేయాలని మాజీ సీఎం కెసిఆర్‌తో కొట్లాడానని, దళితులకు భూమి ఉండదు కాబట్టి వారికివ్వాలని పట్టుబట్టినట్లు, ఈ విషయంలోనే కెసిఆర్‌తో అంతరం వచ్చిందన్నారు.

### క్రీడాకారులను ప్రోత్సహించాలి : తలసాని సాయికిరణ్ యాదవ్

**అడ్డగుట్ట, ఆగస్టు19 ప్రభాతవార్త:**



పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న యువ నేత తలసాని సాయికిరణ్ యాదవ్

క్రీడాకారులను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతారని, అటు వంటి వారికి తగిన ప్రోత్సాహాన్ని, చేయూతనివ్వాలని సికింద్రాబాద్ పార్లమెంట్ యువ నేత తలసాని సాయికిరణ్ యాదవ్ తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో వైష్ణవి మహేష్ అనే యువతి వచ్చే అక్టో బర్ 4 నుంచి 13 వరకు దక్షిణాఫ్రికాలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వైష్ణవి ఎంపికైంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వైష్ణవికి తలసాని ట్రస్ట్ ద్వారా తల సాని సాయికిరణ్ యాదవ్ రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తమ నివా సంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థా యి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనేక మంది క్రీడాకా రులు ఉన్నప్పటికి వారికి సరైన ప్రోతా్సహం లభించకపోవడంతో ఎదగలేక పోతున్నారన్నారు.

**సాయికిరణ్ యాదవ్‌ను అభినందించిన వైష్ణవి . ..**

అంతర్జాతీయ స్థాయిలో జరిగే పవర్‌లిఫ్టింగ్ పోటీలకు వెళ్లేందుకు తనకు అందజేసిన ఆర్థిక సహాయాన్ని తమ జీవితంలో ఎన్నడు మరువలేనని వైష్ణవి మహేష్ తెలిపారు.

## ఘనంగా సామూహిక జంధ్యా దారణ వేడుకలు



**అత్తాపూర్ ఆగస్టు19 ,ప్రభాతవార్త :** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని జంధాల (రాఖీ)పౌర్ణమి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భావన ఋషి మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో సోమవారం సామూహిక జంధ్యా దారణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహికంగా జంధ్యాలను అలంకరించారు. గాయత్రి హోమం నిర్వహించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏర్వ సత్య నారాయణ, దొంత రాజు, కొంపల్లి జగదీష్, సామల యాదయ్య, కొంకతి ఆంజనేయులు, రాజ్ కుమార్ ఏర్వ కుమారస్వామి, దశపతి రాజు లక్ష్మణ్, రాజు, వెంకటేష్, చిరంజీవి, పద్మశాలి కుల బాంధవులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



**అత్తాపూర్ ఆగస్టు19, ప్రభాతవార్త :** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనురాగ బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో ప్రజాపిత బ్రహ్మకుమారి సోదరీమణులు ఎమ్మెల్యేకి రక్ష బంధన్ సందర్భంగా రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....సోదరిమణుల ప్రేమ దేవుడి ఆశీర్వాదం కంటే తక్కువేమి కాదని దు:ఖానికి తావులేని బంధం దూరం విడదీయలేని అనుబంధమని మీకు నేను రక్ష నాకు మీరు రక్ష మనమందరం ధర్మానికి రక్ష అని అన్నారు. నియోజకవరనగ ప్రజలందరికి రక్షా బందన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కళల ద్వారానే జాతీయ సమైక్యత సాధ్యం

-ఎమ్మెస్కో కంటెంట్ ఎడిటర్ వల్లీశ్వర్



సన్మానిత కళాకారులతో వల్లీశ్వర్, రామ్మోహన్, పాలపర్తిసంధ్య, రఘుశ్రీ తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఆగస్టు 19 ప్రభాతవార్త :** భారతీయ కళల వల్ల సాంస్కృతిక మానసిక వికాసం, ధార్మిక జీవనం, పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందుతాయని, తద్వారా జాతీయ సమైక్యతకు మార్గం సుగమం అవుతుందని ఎమ్మెస్కో కంటెంట్ ఎడిటర్ జి.వల్లీశ్వర్ అన్నారు. సమాజంలో అనేక ఇబ్బందులున్నా సాంస్కృతిక సంస్థలు కళలకు ప్రాధాన్యతనిస్తూ కళలను కళాకారులను ప్రోత్సహించడం హర్షదాయకమన్నారు. మన కళలకు విశ్వవ్యాప్తంగా ఆదరణ గుర్తింపు రావడానికి కారణం తల్లిదండ్రులు, నాట్యగురువులేనని వారిని ప్రోత్సహించాలని ఇంటలెజెన్స్ ఎస్పీ, విజయవాడ యు.రామ్మోహన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో శ్రావణ సౌరభాలు శీర్షికన హాస్య, సంగీత, నృత్య కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జి.వల్లీశ్వర్, యు.రామ్మోహన్‌లు, విశిష్ట అతిథులుగా నృత్యగురువు అంజిబాబు, సినీనటి సంధ్యా, ఫ్యాషన్ డిజైనర్ కావ్యరెడ్డి, సంస్థ కన్వీనర్ రఘుశ్రీ, వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి తదితరులు పాల్గొని శ్రావణ సౌరభాల్లో ప్రదర్శనలిచ్చిన కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి, గురువులను అభినందించారు.

## ముగ్గురు విద్యుత్ అధికారులకు పదోన్నతులు



కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ డిఇ టి.లింగయ్య గౌడ్, చార్మినార్ ఎడిఇ కె.విజయ్ కుమార్ కులకర్ణి

**చార్మినార్, ఆగష్టు 19 ప్రభాతవార్త :** దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ పరిధిలోని చార్మినార్ డివిజనల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు విద్యుత్ అధికారులకు పదోన్నతులు లభించాయి. టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరుగా పని చేస్తున్న కె.విజయ్ కుమార్‌కు డివిజనల్ ఇంజనీరు (డిఇ)గా పదోన్నతి లభించింది. పాతబస్తీలో అత్యంత కీలకమైన చార్మినార్ ఎడిగా విజయ్ కుమార్ గత మూడు సంవత్సరాలు నుంచి పని చేస్తున్నారు. అదే విధంగా టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ సిబిడిలో గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అక్బర్, చార్మినార్ సిబిడిలో రెండు సంవత్సరాలు నుంచి ఏఈగా పని చేస్తున్న ఠాకూర్ రాజేందర్ సింగ్‌లకు అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్లు (ఎడిఇ)గా పదోన్నతులు లభించాయి. కాగా డిఇగా పదోన్నతి పొందిన విజయ్ కుమార్ కులకర్ణి సోమవారం చార్మినార్ డిఇ లింగయ్య గౌడ్‌ను కలిసి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలోఫలక్‌నుమా ఎడిఇ రాజు, మొగల్‌పుర ఏఈ పిఎల్‌ఎన్ రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు. విద్యుద్ శాఖలో పదోన్నతులు కల్పించినందుకు విద్యుత్ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.





రాజేంద్రనగర్ సర్కిల్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న బిజెపి మహిళ నేతలు

## శ్రీ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో చండీ హోమం..



శ్రీ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 19, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని చండీ హోమం జరిగింది. ఈ హోమంలో సుమారుగా 130మందికి పైగా భక్తులు పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ హోమంలో ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది.

## రాంగ్‌సైడ్‌పై స్పెషల్ డ్రైవ్..



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్

**కొంపల్లి, ఆగస్ట్ 19, ప్రభాతవార్త**

బాచుపల్లి రోడ్డులోని కోకో కోలా యూ టర్న్ వద్ద సోమవారం ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ప్రశాంత్, ఆర్ఐ అనిల్, ఎస్ఐపి నవీన్, పిఎస్ సిబ్బందితో కలిసి రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 23 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు మొత్తం 25 వాహనాలను స్వాధీనం చేసుకుని బాచుపల్లి లా అండ్ ఆర్డర్ పీఎస్లఓ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రోడ్డుపై రాంగ్‌సైడ్‌లో వాహనాలు నడిపి ప్రజలకు హాని కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్స్‌పెక్టర్ హెచ్చరించారు.

## రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు రాఖీ కట్టుతున్న బ్రహ్మకుమారి ప్రశాంతి

**హైదరాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త**

రాఖీ పండుగ సందర్భంగా నగర వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. సామాన్యులతో పాటు సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కూడా రాఖీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో జరిగిన రక్షా బంధన్ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు బ్రహ్మకుమారి ప్రశాంతి రాఖీ కట్టారు. అలాగే స్థానిక మహిళలు, బిఆర్ఎస్ మహిళా నాయకురాలు పలువురు ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ అనురాగాలకు ప్రతీకగా, అనుబంధాలకు రక్షణగా, మానవ సంబంధాల గొప్పదనాన్ని గుర్తుచేసేది రాఖీ పర్వదినమని పేర్కొన్నారు.

## పేట్‌బషీరాబాద్ పిఎస్‌కు కెమెరాలు వితరణ..

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 19, ప్రభాతవార్త**

దూలపల్లి ఐజాంట్ డ్రగ్ రీసెర్చ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎండి రుద్రరాజు ఎస్ వర్మ, సౌమ్య రుద్రరాజులు సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఏరియాలో కమ్యూనిటీ కెమెరాలు 10లక్షల విలువగల ఎక్యూప్‌మెంట్‌ని మేడ్చల్ డిసిపి కోటి రెడ్డి సమక్షంలో డొనేట్ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ రాములు, ఎస్‌హెచ్ఓ విజయవర్ధన్, ఎస్ఐ కె ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## కొండగట్టు ఏకాదశి మహోత్సవానికి బండి సంజయ్



బండిసంజయ్‌కు రాఖీకట్టి ఏకాదశ మహోత్సవానికి ఆహ్వానిస్తున్న ఉజ్వలకుమారి

**నాంపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త :**

బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కొండగట్టులో జరిగే ఏకాదశ ప్రధాన అర్చక మహోత్సవానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌ను బ్రాహ్మణ సంక్షేమ వేదిక బాధ్యురాలు ఉజ్వల కుమారి ఆహ్వానించారు. ఈమేరకు సోమవారం ఆయనకు రాఖీకట్టి రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపి మహోత్సవ ఆహ్వానం పత్రికను అందజేశారు. కేంద్రమంత్రి బ్రాహ్మణ సంక్షేమ వేదిక నిర్వహిస్తున్నఈ మహోత్సవంలో పాల్గొంటానని అంగీకారాన్ని తెలిపినట్లు ఉజ్వల పేర్కొన్నారు.

## ప్రజాసేవకు అంకితమవుతా

**- కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ప్రజాసేవకు అంకితమవుతూ వారెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అత్యధికప్రాధాన్యత ఇస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. సోమవారం బిజెపి ఓబీసీ మోర్చ నేతలు, మహిళామోర్చ, దళితమోర్చ, బిజెపి,బిజెవైఎం, పలువురు సీనియర్ నేతలు కార్పొరేటర్‌ను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. డివిజన్ ప్రజలకు మరింత ఉన్నతమైన సేవలను అందించడానికి తనవంతు ప్రాధాన్యత ఉంటుందన్నారు. తాను అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్పొరేటర్ స్థాయిలో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని, ప్రజలకు మరింత ఎక్కువ సమయాన్ని కేటాయించడానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ నేతలు ఎం.ఉమేశ్, ధన్‌రాజ్, అరుణ్‌కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



ఎమ్మెల్యే బిఎల్ఆర్‌కు రాఖికడుతున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్



మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డికి రాఖీ కడుతున్న కాంటెస్టెడ్ కార్పొరేటర్ హాజీరా సుల్తానా



శ్రీశైలంగౌడ్ రాఖీ కడుతున్న విద్యార్థులు



మైనారిటీ నేత మహ్మద్ మహమూద్‌కు రాఖీ కడుతున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్



రాఖీ కడుతున్న ఆడపడుచులు



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణిమంజరి



సామ నర్సింహాగౌడ్‌కు రాఖీ కడుతున్న మహిళ



అత్తాపూర్‌లో తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్కళ్లు



బోయిన్‌పల్లిలో జంపనప్రతాప్‌కు రాఖీ కడుతున్న మహిళలు



కేటీఆర్‌కు రాఖీలు కట్టిన కంటోన్మెంట్ మహిళలు నివేదిత తదితరులు



గజ్జెల నాగేశ్‌కు రాఖీ కడుతున్న అంబేద్కర్ నగర్ మహిళలు



రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డిసి రవి కుమార్ రాఖీ కడుతున్న బిజెపి మహిళ నేతలు

**ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన కార్పొరేటర్...**

**నాచారం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** రక్షాబంధన్ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నాచారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ రాఖీ కట్టారు. కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యేకు రాఖీ కార్పొరేటర్...**

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 19, ప్రభాతవార్త :** అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతిరూపం రాఖీ పౌర్ణమి పండుగ అనీ జూబ్లీహిల్స్ మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని బోరబండ సైట్ 2లో కాంటెస్టెడ్ కార్పొరేటర్ హాజీరా సుల్తానా నివాసంలో నియోజకవర్గం మహిళలు పివిఆర్‌కు రాఖీలు కట్టారు. అనంతరం వారికి కానుకలను అందజేశారు.

**కుత్బుల్లాపూర్ పరిధిలో...**

**జీడిమెట్ల, ఆగస్ట్ 19, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం, పిపి నగర్‌లోని ఏఎంఎస్ పాఠశాల విద్యార్థులు సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ని షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద కలిసి రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రషీద్, స్కూల్ ప్రిన్సిపల్ సయ్యద్ ఇమ్రాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

**గన్‌ఫౌండ్రి పరిధిలో...**

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు19ప్రభాతవార్త:** ప్రపంచంలోనే ఈ పండుగకు ఎంతో ప్రత్యేకత విశిష్టత అన్నాచెల్లెల బంధాన్ని దాని పవిత్రతను తెలియజేస్తూ ఈ పండుగను ప్రతి సంవత్సరం శ్రావణ మాసం పౌర్ణమి రోజు జరుపు కొవడం గొప్ప ఆనవాయితీగా వస్తుంది. ఇంటి ఆడపడుచు శక్తి స్వరూపిణి, సాక్షాత్తూ మహాలక్ష్మి ప్రతిరూపం, అంతటిశక్తి గల సోదరి చేత రాఖీ కట్టించుకుంటే అరిష్టాలన్ని తొలగి దేవతలందరి అనుగ్రహం కలుగుతుందన్నారు. ఈకార్య క్రమంలో తదితరులు పాల్గొన్నారు. నగరం నుంచే కాకుండా జిల్లాల నుంచి కూడా ఆడపడుచులు తరలి వచ్చి తమ సోదరులకు రాఖీలు కట్టారు. కాగా పలు శివాలయాలల్లో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి కావడంతో సత్యనారాయణ వ్రతం పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు

**చిక్కడపల్లి పరిధిలో..**

**చిక్కడపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అన్నాచెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళ అనుబంధం రాఖీ పండుగ. సోదరుడు క్షేమంగా ఉండి జీవితాంతం ఉండాలని కోరుకుంటూ గాంధీనగర్ డివిజన్ పరిధిలో సోమవారం బిజెపి మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకుడు ఎండి.మహమూద్ నివాసంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ ఈ సందర్భంగా మహమూద్‌కు రాఖీ కట్టి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, గాంధీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, బిజెపి మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ళ అనుబంధానికి నిదర్శనంగా ఈ వేడుక నిలుస్తుందని కార్పొరేటర్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ పరిధుల్లో రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి.

**బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో**

సోదర సోదరీమణుల ప్రతిరూపంగా జరుపుకునే అపురూపమైన వేడుక 'రాఖీ పండుగ' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగంఅధ్యక్షురాలు మణిమంజరి ఆధ్వర్యంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీకట్టారు. ఈసందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆప్యాయతానురాగాల 'రాఖీ' బంధం అని, సోదరీ తన సోదరుడికి రాఖీ కట్టి ఎప్పుడు అన్న తనకు రక్షగా, తాను అన్నకు అండగా ఉండాలని కోరుకుంటారని, సోదరీ కట్టిన రక్షా బంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడు చెల్లెలికి రక్షగా ఉంటానని రాఖీ ద్వారా తెలియజేస్తారన్నారు.

**బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో**

**సరూర్‌నగర్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** సోదర, సోదరీమణుల మధ్య ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా జరిగాయి. పవిత్ర శ్రావణ పౌర్ణమి రోజు రక్షాబంధన్ పండుగను ప్రజలు సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తమ సోదరులకు రాఖీలు కట్టిన సోదరీమణులు పండుగ విశిష్టతను చాటారు. బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర మేయర్స్, మున్సిపల్ ఛైర్మన్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు సామ నర్సింహాగౌడ్ నివాసంలో రాఖీ వేడుకలు కనుల పండువగా జరిగాయి. మహిళలు ఆయనకు రాఖీలు కట్టారు.

**బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలో...**

**కంటోన్మెంట్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** అక్కా చెల్లెళ్లు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని భగవంతున్ని వేడుకున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. రక్షా బంధన్ వేడుకలను పురస్కరించుకొని సోమవారం బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలో ఆయన అక్కా చెల్లెళ్లతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు జంపనకు రాఖీలు కట్టారు.

**కెటిఆర్‌కు రాఖీ కట్టిన కంటోన్మెంట్ మహిళలు**

రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్)కు కంటోన్మెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి నివేదిత సాయన్న, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, అనితా ప్రభాకర్, భాగ్యశ్రీలు రాఖీ కట్టి అన్న చెల్లెళ్ల అనుబందాన్ని చాటుకున్నారు.

**గజ్జెల నాగేశ్‌కు రాఖీ కట్టిన మహిళలు**

రాఖీ పండుగను పురస్కరించుకొని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళా ప్రతినిధులు సోమవారం బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలందరికి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాబమ్మ, సుశీల, రాములమ్మ, లక్ష్మి, నిస్సీ, ఐస్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణకు వ్యతిరేకంగా రేపు 'భారత్ బంద్'ను విజయవంతం చేయాలి

**-ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు**



ఐక్యత చాటుతున్న దళిత సంఘాల నేతలు. చిత్రంలో వడ్డలమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఈ నెల 21న దేశ వ్యాప్తంగా దళిత వర్గాలు చేపట్టిన 'భారత్ బంద్'ను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని పరివర్తన లా ఛాంబర్స్‌లో వివిధ దళిత పార్టీలు, ఎస్సీ కుల సంఘాలు ఆధ్వర్యంలో జరిగిన పోరాట సమితి పోరాట కార్యాచరణను రూపొందించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పోరాట సమితి చైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ దళిత జాతి రాజ్యాధికారాన్ని సాధించుకోకుండా అణిచివేయాలని మనువాద పాలక పార్టీలు సామాజిక కుట్రలు చేశాయని ఇందులో భాగమే వర్గీకరణ అంశమని ఆరోపించారు. వర్గీకరణలకు వ్యతిరేకంగా దేశంలో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాల ఎదుట పోరాటాలు, ర్యాలీలు నిర్వహించాలని ఆయన దళితులకు పిలుపునిచ్చారు. 'వర్గీకరణ అంతం-దళితుల పంతం' అనే నినాదంతో పెద్ద ఎత్తున పోరాటం చేయాలని, వర్గీకరణకు అనుకూలంగా ఉన్న అన్ని దోపిడీ కుల పార్టీల భరతం పట్టాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచడానికి సిద్ధం కావాల్సిన సమయం అసన్నమైందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుల రాజలింగం, గవ్వల శ్రీకాంత్, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్, నేతకాని మహర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుల్లె వెంకటేష్, వసంతరావు, భూపల్లి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## 29న రవీంద్ర భారతిలో గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాలు

**సైఫాబాద్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** ఈ నెల 29వ తేదీన రవీంద్రభారతిలో గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ బైలూరు యోగీశ్‌ప్రభు తెలిపారు. పిల్లల్లో చైతన్యం, పెద్దల్లో జ్ఞానం తీసుకురావడమే ఈ వార్షికోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. ఇందులో భాగంగా విష్ణు సహస్రనామం, భగవద్గీత పారాయణం శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు, భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, జై భారత్ నేషనల్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, వివిధ అర్చక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని ఆయన వివరించారు. సమావేశంలో బానరస్ స్వామిజీ, బడే సాహెబ్, మనోహర్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

**చిక్కడపల్లి, ఆగస్టు19 ప్రభాతవార్త :**

చిక్కడపల్లిలోని పవిత్రమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్స వాలలో భాగంగా పూర్ణాహుతి, 41 కలశాలతో స్వామివారికి విశేషమైన పూజా కార్యక్రమం ఆల యం వ్యవస్థాపక వంశీయులు జి.రాజేంద్ర నాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతి అనం తరం 41 కలశాలతో అభిషేకం, తిరుమంజన సేవ, మహానైవేద్యము, మంత్రపుష్పం, పవిత్ర ప్రదానం, చందన గోష్ఠి, ఆశీర్వాదము, వేదపండి తులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి జరిగే పవిత్రోత్సవాల్లో హాజరై స్వామి కృపకు పాత్రులయ్యారు.

**చెవికత్తిరించని కుక్కలుంటే ఫిర్యాదు చేయండి**

**హైదరాబాద్, ఆగస్టు 19,ప్రభాతవార్త:** సంతా నం కలగకుండా వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తున్నామని ,వీటిని గుర్తించేందుకు వీలుగా చెవినివి ఆకారంలో కత్తిరిస్తున్నామని జిహెచ్ఎం సి కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. చెవి కత్తిరిం చకుండా కుక్కలు కనిపిస్తే తమకు "మై జిహెచ్ ఎంసి "మొబైల్‌యాప్‌ద్వారా ఫిర్యాదు చేయవ చ్చుని తెలిపారు. ఈమేరకు ఎస్ఎంఎస్ రూపం లో గ్రేటర్‌లోని 20లక్షలల ఫోన్ నెంబర్లకు ఆమె సందేశం పంపారు. యాప్‌లో వెటర్నరీ గ్రీవెన్స్ లింకును క్లిక్ చేసి కుక్కల ఫోటోలు, ప్రాంతం వంటి వివరాలు అందించాలని కోరారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి: చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 19, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడ యాదాద్రీ ఆక్సిజన్ పార్కు వద్ద వనమహోత్సవం కార్యక్రమంలో చైర్మన్ బి.కొండల్ రెడ్డి సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి వాతా వరణం అందించడానికి మొక్కలను నాటి పెంచాల్సిన బాధ్యత మున్సి పల్ ప్రజలందరిపై ఉందని అన్నారు. పార్కులో టెకోమో, కార్పాన్స్, మినిఒక్సీర, షోప్లాంట్స్ అనే 4 రకాల మొక్కలు నాటినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే వివేకానందకు రాఖీలు కట్టిన మహిళామణులు



ఎమ్మెల్యే వివేకానందకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

**నిజాంపేట్, ఆగస్ట్ 19, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన మహిళామణులు, నాయకురాళ్లు ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి రాఖీలను కడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలలో ప్రతీ పండుగలలో ఒక పరమార్థం దాగివుందని, సోదరభావాన్ని పెంచే ఈ రాఖీ పర్వదిన వేళ మహిళా సోదరులందరికీ రాఖీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.

## భక్తిశ్రద్ధలతో మైసమ్మ బోనాలు

**కొందుర్గు, ఆగస్టు 19, (ప్రభాతవార్త) :** గ్రామ దేవత అయిన మండల కేంద్రంలోని మాలకిష్టమైసమ్మ దేవతకు భక్తి శ్రద్ధలతో ఘనంగా బోనాలను సమర్పించారు. సోమవారం నాడు సాయంత్రం గ్రామంలోని పలు వీధులలో తయారు చేసిన బోనాలను డప్పు వాయిద్యాలు ముందర మహిలు వాటిని ఎత్తుకొని ర్యాలీగా రాగా వచ్చి అమ్మవారి దేవాలయం ముందు ప్రదక్షణలు చేసి చల్లంగా దీవించమ్మా అంటూ భోనాలను సమర్పించి మొక్కుబడులను తీర్చుకున్నారు. బోనాల ఉత్స వాలను పురస్కరించుకొని మైసమ్మ దేవాలయాని రంగులు వేసి పచ్చని తోరణాలతో ఆలంకరించారు. ఈ ఉత్సవాలలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుకు రాఖీ కడుతున్న మహిళలు

## హరీష్‌రావుకు రాఖీ కట్టిన మహిళలు

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :**

రాఖీ పర్వదినం సందర్భంగా సిద్దిపేటకు చెందిన మహిళలు హైదారాబాద్‌లోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు సిద్దిపేట బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐ రాజుగౌడ్**

**కొమురవెల్లి, ఆగస్టు 19,ప్రభాతవార్త :**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లింగపల్లి రాజుగౌడ్ సూచించారు. మండల పరిధిలోని కిష్టంపేట గ్రామంలో సోమవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాలలో ఎక్కడైనా గంజాయి అమ్మిన, సేవించినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. యువత గంజాయిలాంటి చెడు అలవాటుకులోనై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. రేషన్ బియ్యం, ఇసుక అక్రమంగా రవాణా చేసిన నిల్వ చేసిన చర్యలు తప్పవన్నారు. ప్రతి వాహనాదారుడు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. మండలంలో శాంతిభద్రతల రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

**నంగునూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామంలో సోమవారం రుణమాఫీ పూర్తిగా కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పిన సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని సిఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ. 2లక్షల రుణమాఫీ పూర్తిగా చేసే వరకు ఆందోళనలు చేస్తునే ఉంటామన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :**

జిల్లా ఫొటోఅండ్‌వీడియో అసోసియేషన్ భవనంలో సోమవారం అసోసియేషన్ సభ్యులు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి గణేష్, కోశాధికారి లగిశెట్టి నవీన్,బుక్క శ్రీను, దండు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.


చాయ్ చెస్కా హోటల్ యజమానికి నోటీసులు అందచేస్తున్న పంచాయతీ కార్యదర్శి

## హోటల్ యజమానికి పంచాయతీ నోటీసులు

**చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో చాయ్‌చెస్కా హోటల్ యజమానికి పంచాయతీ కార్యదర్శి సోమవారం నోటీసులు జారీ చేశారు. హోటల్ పరిసరాల్లో మూత్రశాలలు ఏర్పాటుచేయకపోవడం, తడి పొడి చెత్తను రోడ్డుపై పారేయడం, మురుగు నీరు హోటల్ పరిసరాల్లో పేరుకుపోయి ఉండటాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు కాశపాగ ఇమ్మయ్య జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయడంతో డిపిఒ సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందచేశారు. పరిసరనాలు 3 రోజుల్లో పరిశుభ్రం చేయించడం, మూత్రశాలల నిర్మాణం, తడి పొడి చెత్తను వేరు వేరుగా చేసి అందించేలా చూడాలని ఆదేశిస్తూ నోటీసులు అందచేశారు. పంచాయితీ నోటీసు ప్రకారం స్పందించకుంటే తగు చర్యలు తప్పవని నోటీసులు హోటల్ నిర్వాహకులకు హెచ్చరించారు.

## ఫార్మాసిటీకి పంట భూములు ఇవ్వం

**-రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన**


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఫార్మసిటీ భూబాధితులు

**న్యాల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** పూర్వీకుల నుంచి వచ్చిన, కొను గోలు చేసిన పట్టా భూములు, పేదల కోసం ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ భూములే తమ జీవనాధారమని, తమ జీవనాధారం అయిన భూములను ఫార్మా సిటి కర్మాగారానికి ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల శివారులో 2వేల ఎకరాల్లో ఫార్మకెంపెనీని ఏర్పాటు చేసేందుకు అధికారులు భూము లను సర్వే చేశారు. తమ భూములను కర్మాగారానికి సర్వే చేయడాన్ని నిరసిస్తూ సోమవారం న్యాల్‌కల్‌లోని రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనకు దిగి పెద్దఎత్తున కర్మాగారానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ సురేష్‌కుమార్‌కు రైతులు వినతిపత్రం అందచేశారు. ఫార్మా కంపెనీకి అధికారులు భూములను బలవంతంగ లాగుకునేందుకు యత్నిస్తే చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామా లకు చెందిన రైతులు రవికుమార్, మారుతియాదవ్, శ్రీపతి నాగన్న, ఓంకార్‌యాదవ్, శివరాజ్, రవి గౌడ్, రవి, మల్లేష్, నరేందర్‌రెడ్డి, ఖదీర్, శివకుమార్, వీరన్న, నాగన్న, మల్లప్ప, పాండు,కార్తీక్, అర్జున్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణగౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో సోమవారం ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాలాజీ, సతీష్, ప్రధానకార్యదర్శి భూమయ్య, కోశాధికారి మురళీ, సభ్యులు యాదగిరి, ఆంజనేయులు, రాజు, భవాని లక్ష్మణ్, భరత్, రవికాంత్, అజయ్, జిల్లా అధ్యక్షులు సుప్పల శ్రీనివాస్, ల్యాబ్ ప్రభన్న, మహేశ్వరప్ప, గోపాలన్న, నర్సిములు, రాజేష్, అను సురేష్, సురేందర్ పాల్గొన్నారు.

## న్యాయవాదిపై పోలీసుల దాడి హేయం



పోలీసుల దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** కూకల్‌పల్లి న్యాయవాది సంతోష్‌పై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్యగా న్యాయవాదులు అభివర్ణించారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్క రించి నిరసన వ్యక్తం చేశారు. కోర్టు ముందు న్యాయవాదులు పోలీసు దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని న్యాయవాదులు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## కేతకి ఆలయాన్ని దర్శించుకున్న ఎంపి సురేష్‌శెట్కార్

**ఝరాసంగం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని జహీ రాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ తన ధర్మపత్ని ఉమా శెట్కార్‌తో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలోని అమృతగుండంలో పాద ప్రక్షాళన చేసుకోగా అర్చకులు పూర్ణకుంభంతో ఎంపి కుటుంబ సభ్యులను ఆహ్వానిం చారు. ఆలయంలో జంగములు వేదమంత్రాలు వల్లిస్తుండగా ఎంపి సురేష్ కుమార్ శెట్కార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎంపికి, కుటుంబసభ్యులకు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, న్యాల్‌కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరెదార్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, శంకర్‌పాటిల్, రాజ్‌కుమార్ స్వామి, ఆలయ ఈఓ శశిధర్, అర్చకులు శివప్రసాద్ స్వామి, హరికిషన్ జోషి, బసయ్యస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


కేతకి ఆలయాన్ని దర్శించుకుంటున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్


సంగారెడ్డిలో ఎమ్మెల్యేకు రాఖీలు కడుతున్న చిన్నారులు


హద్నూర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి


మనూర్‌లో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు


ముక్తాపూర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

# గ్రామ గ్రామాన ఘనంగా రాఖీ పండుగ

**చిన్నశంకరంపేట, ఆగస్టు 19,ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా ప్రజలంతా సోమవారం ఆందోత్సాహాల మధ్య రాఖీ పండుగను వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో సోదరిమణులు సోదరులకు రాఖీలు కట్టి ఆప్యాయతను చాటారు. ఆడపడుచులు పుట్టింటికి చేరుకొని సోదరులకు, ప్రేమతో కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ రాఖీలుకట్టి దీవించారు. దీనికి ప్రతిగా సోదరులు నూతన వస్త్రాలు, బహుమతులను కానుకగా అందచేశారు. చెడుపై విజయాలను సాధిస్తూ, ఎల్లవేళలా నాకు రక్షగా ఉండాలని సోదరీమణులు ఆకాంక్షించగా, సోదరులు ఆ హామిని నిల బెట్టామని ఆశీర్వదిస్తూ, ఆశీర్వాదం తిసుకుంటూ కానుక లను సమర్పించారు. ప్రతి ఇంట్లోనూ, కుల,మతాలకు అతీతంగా రాఖీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

### న్యాల్‌కల్ మండలంలో...

**న్యాల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** సోదర భావానికి ప్రతీకంగా నిలిచే రక్షా బందన్ పర్వదినాన్ని సోమవారం న్యాల్‌కల్‌తోపాటు ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకు న్నారు.అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు ఆదివారం రాత్రి పుట్టినిళ్లకు చేరుకోవడంతో గ్రామాల్లో ఆడపడుచులు సం దడి నెలకొంది. సోమవారం ఉదయం 5.53 గంటల నుంచి మధ్యాహ్నం 1.32 గంటల వరకు భద్రకాలం ఉందంటూ ఆ సమయాల్లో రాఖీలు కట్టడం శుభప్రద కాదని సోషల్‌మీడియాలో వార్త చక్కర్లు కొట్టడంతో మధ్యా హ్నం వరకు సోదరులకు రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెళ్లు ఎదురు చూస్తూ ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం సోదరుకలు సోదరీమణులు రాఖీలు కట్టి నోటిని తీపి చేసి కానుకలు అందుకుని ఆశీర్వచనాలు అందచేశారు.

### మనూర్ మండలంలో...

**మనూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాఖీ పండగను సోమవారం మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండ లంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు అత్తారింఢ్ల నుంచి పుట్టింటికి చేరుకుని రాఖీలు కట్టి నోటిని తీపి చేసి కానుకలు అందుకున్నారు. రాఖీ పండగను పురష్కరించుకుని ఆయా గ్రామాల్లో ఆడపడుచుల, స్నేహితుల సందడి కానవచ్చింది.

### నాగల్‌గిద్ద మండలంలో...

**నాగల్‌గిద్ద, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండలంలో సోమవారం అన్నాచెల్లెళ్ల అక్కతమ్ముళ్ల ప్రేమాను బంధా లకు ప్రతీక అయిన రక్షాబంధన్ రాఖీ పండగను సోమ వారం ఘనంగా జరుపుకున్నారు. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు సోదరులకు రాఖీలు కట్టేందుకు పుట్టింటికి చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి నోటిని తీపి చేసి కానుకలు అందుకుని శుభాకాంక్షలు తెలిపారు.

### పాపన్నపేట మండలంలో...

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** అన్నా చెల్లెళ్ల అనురాగబంధానికి, అక్కా తమ్ముళ్ల ఆప్యాయతకు ప్రతీకం గా నిలిచే రక్షాబంధన్ పండగను సోమవారం పాపన్న పేటతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆనందో త్సహాలతో ఘనంగా జరుపుకున్నారు. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు పట్టింటికి చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి శుభాక్షంక్షలు తెలిపి కానుకలు అందుకుని సోదరులకు ఆశీస్సులు అందచేశారు.

### అల్లాదుర్గంలో...

**అల్లాదుర్గం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి నిదర్శనంగా నిలిచే రాఖీ పండగను సోమవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపు కున్నారు. అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు స్వగ్రామా లకు చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి దీవెనలు అందచేసి కానుకలు అందుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆడపడుచులు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి.

### ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన చిన్నారులు...

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాఖీ పండగను పురష్కరించుకుని సోమవారం సదాశివపేట పట్టణలోని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు శిశు మందిరం విద్యార్థినులు రాఖీలుకట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో చింత సాయినాథ్, శిశుమందిరం పాఠశాల ప్రధానాచార్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

### పుల్కల్ మండలంలో...

**పుల్కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రాఖీ పండ గను ఘనంగా జరుపుకున్నారు.అత్తారిళ్లకు వెళ్లిన గ్రామాల ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వదించి నోటిని తీపిచేసి కానుకలు అందుకు న్నారు. ఆయా గ్రామాల్లో స్నేహితులు ఒకిరికి ఒకరు రాఖీలు కట్టుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


చిన్నశంకరంపేటలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు


అల్లాదుర్గంలో రాఖీలు కడుతున్న సోదరీమణులు


మాజీమంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌లకు రాఖీ కడుతున్న సింధూఆదర్శ్‌రెడ్డి

## మాజీ మంత్రులకు రాఖీలు కట్టిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాఖీ పండగను పురస్క రించుకుని సోమవారం మాజీ మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌లకు భారతీ నగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి రాఖీలుకట్టి పండగ శుభాకాంక్షలు తెలి పారు. హరీష్‌రావుకు ఆయన నివాసంలో, కేటిఆర్‌కు తెలంగణ భవన్‌లో కార్పొరేటర్ రాఖీలు కట్టి మిఠాయిలతో నోటిని తీపి చేశారు,

## భగలాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

**శివ్వంపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కొలువైన భగలా ముఖి శక్తిపీఠంలో పౌర్ణమి పురస్కరించుకొని సోమవార అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి హరిదార్చన, మంగళ హారతి, మహాతంత్ర హవనము, హోమం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థల దాత పబ్బా రమేష్‌గుప్త, మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త, ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ, సూర్యం గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో పల్లకి సేవ

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గాభవాని మాతకు సోమవారం పల్లకి సేవ నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకలో ప్రతిష్టించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని స్మరిస్తూ భజా భజంత్రీల మద్య పల్లకి సేవను ఆలయం మండపం నుంచి రాజగోపురం శివాలయం ముందు నుంచి ఆలయం వరకు ఊరేగించి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్ శర్మ, యాదగిరి, రవి, మహేష్, నరేష్, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజలు బిఆర్‌ఎస్‌ను నమ్మేస్థితిలో లేరు

**-కాంగ్రెస్ పార్టీ సంగాయిపేట గ్రామ అధ్యక్షుడు సంగన్నగారి ఆగంగౌడ్**

**కొల్చారం, ఆగస్టు 19 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందని కాంగ్రెస్ పార్టీ సంగాయిపేట గ్రామ అధ్యక్షుడు సంగన్నగారి ఆగంగౌడ్ అన్నారు. కొల్చారం మండలం సంగాయిపేట గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సంగన్నగారి ఆగంగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుంటే బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ గతంలో పది సంవ త్సరాలు అధికారంలో ఉండి సబ్బండ వర్గాలను మోసం చేసిందని, దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వంటి వాటి గురించి చెబుతూ పది సంవత్సరాలు ప్రజలను మోసం చేశారన్నారు.ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని నమ్మే స్థితిలో లేరని వారు తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, అయినా హరీష్‌రావు ఏ ముఖం పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శిస్తారని ప్రశ్నించారు. 2 లక్షల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా అన్నా హరీష్‌రావు ముందు రాజీనామా చేసి మాట్లాడాలని అన్నారు.

## వెల్దుర్తి తహసీల్దార్‌గా కృష్ణ

**వెల్దుర్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** వెల్దుర్తి నూతన తహశీల్దార్‌గా జి. కృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. టెక్మాల్ మండలం నుండి బదిలీపై వెల్దుర్తికి వచ్చారు. వెల్దుర్తి తహశీల్దార్‌గా పనిచేసిన తులసీరామ్ టేక్మాల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీక రించిన జి. కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.

## నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కమలాద్రి

**శివ్వంపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త:** మండల తహశీల్దార్‌గా కమలాద్రి బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా వచ్చిన తహశీల్దార్ నర్సాపూర్ నుండి బదిలీపై శివ్వంపేట మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు శివ్వంపేటలో విధులు నిర్వహించిన తహశీల్దార్ శ్రీనివాస్‌చారి బదిలీపై మెదక్ కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ కమలాద్రి మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ భూ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని తెలిపారు.

## మాసాయిపేటలో ఘనంగా మహంకాళి జాతర

**వెల్దుర్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేటలో రెండు రోజుల నుండి గ్రామస్థులు గ్రామ సమీపంలో గల మహంకాళి దేవా లయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆదివారం సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం మహంకాళి ఆలయం వద్ద గావు రంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు తండోపతండాలుగా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


గావు రంగం నిర్వహిస్తున్న దృశ్యం


పద్మాశాలి సంఘం జండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షులు గడ్డం జనార్ధన్

## పద్మాశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పండగ

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రాఖీ పండగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణం లోని మార్కెండేయ ఆలయం ప్రాంగణంలో పద్మశాలీలల పులిగుర్తు జండా ను సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో వేణుభట్ ఆధ్వర్యం లో జోగు అనిత యాదగిరి దంపుతులు రుద్రాభిషేకం, యజ్ఞ కార్యక్రమాలు, ఆర్యసమాజం అధ్యక్షులు ఈశ్వర్ జి మాస్టారు బండారి సుదర్శన్ ఆధ్వర్యం లో గాయత్రీ దేవి యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి ఇటీవల ముగిసిన 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన బోడవెన్నెలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పి రాములు నేత, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కర్దాస్ మనోహర్, కోశాధికారి గడ్డం నాందేవ్, సలహాదారు దోమల పండరి, న్యాయవాదులు కర్దాస్ పవన్, మాశెట్టి జగదీశ్, కార్యవర్గ సభ్యులు సుదర్శన్, బండారి, మారెల్లి వెంకటయ్య, కొప్పెరి లక్ష్మణ్, చిప్ప సత్యనారాయణ, సగ్గం విఠల్, అప్పం శ్రీనివాస్, గుండ్ల మల్లయ్య, గూడ జన్, సగ్గం శ్రీనివాస్, గడ్డం పాండు, మేనేజర్ నీలి రాజేష్, దైవంశెట్టి సామల పండరి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి సన్మానం

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రాష్ట్ర సెట్విన్ కార్పోరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గిరిధర్‌రెడ్డికి ఈ నెల 20వ తారీఖున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన సభను నిర్వహిస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పినరసింహారెడ్డి తెలిపారు మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని సుభాష్‌గంజ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా పస్తాపూర్ చౌరస్తావద్ద ఉన్న ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో గిరిధర్‌రెడ్డిని ఘనంగా సన్మానిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, టిపిసిసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, నాయకులు ఉజ్వల్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సన్మాన సభను జయవంతం చేయాలని నర్సింహారెడ్డి సూచించారు.

## రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దు : ఎవో

**రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 19, ప్రభాతవార్త :** రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ అన్నారు. సోమవారం ఆయన రైతులతో మాట్లాడుతూ, మండలంలోని రుణ మాఫీ 2024 సంబంధించి మూడు విడతల్లో వారి ఖాతాలో నిధులు జమ కాబడినవని అన్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల బ్యాంకు ఖాతాలు సరిగాలేనివి, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నెం బర్లలో తప్పులున్నవి, పాస్‌బుక్ నెంబర్లు లేనివి, బ్యాంకు ఖాతాల్లో ఉనవన పేర్లతో ఆధార్‌లో ఉన్న పేర్లతో సరిపోని ఖాతాలు లాంటి వివిధ కారణాల వల్ల మరి కొంతమంది రైతులకు చెందిన రుణ ఖాతాల్లో నిధులు జమకా బడలేదన్నారు. ఈ రైతులకు చెందిన విజ్ఞప్తులను, ఫిర్యాదులను స్వీకరించ డానికి మండల కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన ప్రత్యేక కౌంటర్లు రేపటినుండి ఏర్పాటు చేసి విజ్ఞప్తులు, ఫిర్యాదులను తీసుకోవడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని ఆయన పేర్కొ న్నారు. రెండు లక్షల పైబడి రుణ కలిగిన రైతులకు రెండు లక్షలు పోగా మిగతా రుణం తిరిగి చెల్లించడానికి చాలామంది రైతులు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ రైతులకు సంబంధించి ప్రభుత్వం నుండి రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో ఆదేశాలు వెలువడుతాయని, అప్పటి వరకు రైతులు వేచి చూడాలని తెలిపారు. రుణమాఫీకి సంబంధించి ఎలాంటి విజ్ఞప్తులు, సమస్యలు, సందేహాలు ఉన్న మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులను కోరారు. కాగా 12.12.2018 నుండి 09.12. 2023 గడువులోపు రుణం పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని జీవో నెంబర్ 567 ప్రకారం రైతులకు రుణమాఫీ అందుతుందని రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక విజ్ఞప్తుల విభాగాన్ని సందర్శించి తమ ఫిర్యాదులను అందించాలని రైతులను కోరుతున్నామన్నారు.


మాట్లాడుతున్న ఎవో రాజ్‌నారాయణ

# ఎన్కెమురిలో ఎక్కడ చూసినా చెత్త చెదారం

**పట్టించుకోని ప్రత్యేక అధికారులు**
**ఇబ్బందుల్లో గ్రామస్థులు**

**కంగ్టి, ఆగస్టు 19 ప్రభాతవార్త:**
ఎన్కెమురి గ్రామంలో ఎక్కడచూసినా చెత్త చెదా రం మురికి నీరే దర్శనమిస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంగ్టి మండలం ఎన్కె మురిగ్రామంలో గ్రామస్థాయి, మండల స్పెషల్ అధి కారులు, అధికారుల పాలన ఉండటంతో గ్రామాల్లో వారు ఎప్పుడూ సందర్శించిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని నెలలు గా సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ఆయా గ్రామాలకు గ్రామ, మండల స్పెషల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆయా గ్రామాలకు చుట్టపుచూపుగా నెలలో ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసినట్లు దర్శనమిస్తుంటారు.గ్రామస్థాయి, మండల స్పెషల్ అధికారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో మురికికాల్వల్లో చెత్త చెదారం నిండిపోయి దుర్వాసన వెలజల్లుతోంది. నల్లాల వద్ద మురికి నీరు చేరుకోవడంతో తాగునీరు కలుషితం అవుతున్నాయని అధికారులకు ఎన్ని సార్లు ఎన్నివించినా ఫలితం లేదని గ్రామస్థులు తెలిపారు. కాగా గ్రామంలో ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలతో వీధుల గుండా కనిపిస్తుంటాయి. వీటి వల్ల దోమలు ఏర్పడి రోగాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. రాష్ట్రంలో స్వచ్ఛ దనం పచ్చదనంలో భాగంగా అన్ని పంచాయతీల్లో పనులు ముమ్మరంగా జరిగినా ఎన్కెమూరి గ్రామం లో గ్రామస్థాయి అధికారి, మండల స్పెషల్ స్థాయి అధికారుల దర్శనమే కరువయ్యిందని గ్రామస్థులు తెలిపారు.ఇప్పటికైనా కలెక్టరు స్పందించి ఎన్కెమురి గ్రామానికి ఇంఛార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని గ్రామంలో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుని సమస్య లను పరిష్కరించాలనివారు కోరుతున్నారు.


తాగునీటి నల్ల వద్ద ప్రవహిస్తున్న మురుగు నీరు